# ఒకటీ బై నాలుగు

సాయంకాలం నీరెండ ఆయన బుగ్గలమీద పడి తెల్లటి గడ్డం వెండిలా మెరిసింది. ఎండ వల్లా, కొంచెం కోపం వల్లా ఆయన ముఖం ఎర్రబడింది. ముదిగొండ శాస్త్రిగారన్నారు -

''శాసన పాఠం నేను స్వయంగా చూశాను. రాజమండ్రీ గ్రంథాలయంలో అఘోరించింది. క్రీ.శ. 1625 ఆలయానికి ధూపదీప నైవేద్యాల నిమిత్తం అయిదెకరాల భూమీ, అర్చకుడిగా ముదిగొండ పరమేశ్వర శాస్త్రిని. అనగా మా వంశానికి పురుషుడన్న మాట. ఆయన్ని నియమించారు''

కృష్ణమూర్తి మాస్టారు గొంతు సవరించుకుని అడిగేరు. ''అంటే ఇప్పుడా వంశం, తమదీ...''

''మీ అనుమానం అర్థమైంది. ఈ రుజువులన్నీ పది రోజుల కిందటే రాజుగారికి మనవి చేశాను. మధ్యలో కుక్కగొడుగుల్లా లేచి అల్లరి జేస్తే కుదురుతుందా? మా వంశంలో ముదిగొండ నాగభూషణుడనీ, కవీ, వ్యాకరణ పండితుడూ ఉండేవాడు. ఆయనా జగన్నాథ పండిత రాయలి శిష్యుడొకాయినా సహపాఠులంటారు. ఇంతకీ ఆయన 'మానవతీ చరిత్రం' అని ప్రబంధం వ్రాశారు. అందులో అశ్వాసాంత పద్యాల్లో పరమేశ్వర శాస్త్రిగారు దగ్గిర్నుంచీ తన వరకూ వంశవృక్షాన్ని ఉటంకించారు. అదలా ఉంచండి... ముందు కాఫీ పుచ్చుకోండి''

శాస్త్రిగారు రెండు చేతులతో జాగ్రత్తగా గ్లాసు తీసుకుని శబ్దం చేస్తూ కాఫీ చప్పరించారు. మేస్టారు గ్లాసు నందుకుని ఆయనవేపే చూస్తూ ఉండిపోయారు. (''ఛస్తే మాట వినే ఘటం కాదు'')

శాస్త్రిగారికి ఎనభై రెండేళ్ళు. సహస్ర చంద్ర దర్శనం అయిందని కొంతకాలం క్రితం ఊళ్ళో శాంతి సంతర్పణ చేయించారు. వరండాలో బెంచిమీద కూచున్నారిద్దరూ. మఠం వేసుకొని మేస్టారికి ఎదురుగా కూచున్నారు శాస్త్రి గారు. తీగల అల్లకం లోంచి ఎండ మెత్తగా ఆయనమీద పడుతోంది. తెల్ల జామపండు లాంటి ఆయన ఒంటిమీద ముత్యాల్లాంటి స్వేదబిందువులు మెరిశాయి. ఎర్రటి ఆయన పెదాలు కాఫీ వేడితో ఇంకెంచెం కందినట్లు కనిపించాయి.

కృష్ణమూర్తిగారు ఏభై అయిదేళ్ల మనిషి. ఆ ఊళ్ళో మేస్టారు.

శాస్త్రిగారు హఠాత్తుగా అందుకున్నారు. ''నా చిన్నతనంలో మా తండ్రిగారు, ఉమాపతిగారనీ మీరు వినే వుంటారు. అగ్నిహోత్రం. ఓ కోర్టు కేసులో నాలుగేళ్లు అహోరాత్రాలు కష్టపడి మా వంశవృక్షం తయారుచేయించారు. అది చూస్తిరా, మీకే తెలుస్తుంది క్రిష్ణమూర్తిగారూ! వయసులో చిన్నవారైనా మీరు విజ్ఞులు. ఈ వయసులో అర్చకత్వం, అఘోరింపూ ఎందుకండీ నాకు? ఏం కమాయించు కుందావనీ! శివాలయం మాది. నేను వెళ్ళిపోయే వరకూ దీపం పెట్టవలసిందే. మరో మాట లేదు. రాజుగారికి తెలియదని గాదు. దీనికి గొడవ ఎందుకు? పోనీ రాజమండ్రి కోర్టులో కాయితం ముక్క పడెయ్యమంటారా, మీ ఆజ్ఞ ఏవిటి?''

''అమ్మమ్మ! ఎంత మాట! మీకు చెప్పగల వాడిననా? దీన్ని ఏదో విధంగా ఊళ్ళో గొడవలు లేకుండా పరిష్కరించాలనే రాజుగారి ఉద్దేశం. నేను కలిగించు కోడానికున్నాడా కారణం అదే''

చటుక్కున శాస్త్రిగారు నవ్వేరు. ''మనం సరే. మరి మా ఎగస్పార్టీ వారి ఉద్దేశం?''

''విశ్వేశ్వరంగారి నింకా కలవలేదు''

''చెప్పండి. వాడికా హక్కు ఎలా వచ్చిందో వివరం అడగండి''

''అయితే మీరు చెప్పిన కుమారపుర శాసనం...''

''నా దగ్గిర లేదని చెప్పేనుగా!''

ఒక క్షణం ఆలోచిస్తూ ఉండి పోయారు మేస్టారు. శాస్త్రిగారు కళ్ళు చికిలించి ఆయన వేపే చూస్తున్నారు.

''సరే శాస్త్రిగారూ! నాకు సెలవిప్పించండి. మళ్ళీ కలుస్తాను. మీరు లేవకండి పెద్దవారు.''

మేస్టారు లేచి కండువా సద్దుకుని శాస్త్రిగారికి నమస్కరించి వెళ్ళబోతూ అన్నారు - ''మరిచి పోయాను. శివలింగం వెనుక ఏదో చిన్న శాసనం ఉందంటున్నారు. నేనింకా చూడలేదనుకోండి''

''అలాగా? బావుంది. మీరు కూడా ఒకసారి చూడండి''

కృష్ణమూర్తిగారు మెట్లు దిగి వెళ్ళిపోయారు. మూతి బర్రలా వంచి ఆయన వెళ్ళిన వేపే చూస్తూ యాజ్ఞోపవీతం చెవికి చుట్టుకున్నారు శాస్త్రిగారు.

మేస్టారు ఆ రోజు రాత్రి బలరామరాజుగారి దగ్గరికి వెళ్ళేరు. భోజనం ముగించి వాలు కుర్చీలో కూచుని చుట్ట వెలిగించారు రాజుగారు.

''ఊఁ చెప్పండి. భోజనం చేశారా?''

''నాకింకా ఆలస్యం ఉంది లెండి''

''అవునౌను. వయసయిపోతోంది. వేళకింత తినేసి కూచుంటం అలవాటయిపోయింది''

నవ్వేరు కృష్ణమూర్తిగారు.

''చెప్పండి''

''శాస్త్రిగార్ని సాయంకాలం కలిశాను. ఆధారాలతో సహా అన్నీ ఏకరువు పెట్టారు''

''శాసనం గురించి చెప్పేరా?''

''అసలు మూలం అదే గదా!''

''మరేం జేద్దామంటారు? మీరే ఉపాయం ఆలోచించి ఊళ్లో గొడవలు లేకుండా చెయ్యాలి''

''నిజమే. శాస్త్రిగారనేదే సబబు. కానీ...''

''మరి విస్సేశరం గారి గొడవుంది గదా. జనాన్ని పోగేసుకుని రాజకీయానికి సిద్ధపడి పోయాడాయన ఏటో.''

''శివాలయంలో ఎప్పుడో వాళ్ళ పూర్వీకులు అర్చకులుగా ఉండేవారట. అది పాడుబడిన తరవాతనే ఒదిలేసుకున్నావంటున్నారు''

''ఏ కారణం చేతో విశ్వేశ్వరంగారి పూర్వీకులు కొంతకాలం అర్చకులుగా వుండేవారు. అదీ నిజమే. శాస్త్రిగారి వంశంలో ఒకాయన చాకలిదాన్ని ఉంచుకున్నాట్ట. అది బయటికి పొక్కి ఆయన్ని గుళ్ళోనుంచి వెళ్లగొట్టే రంటారు విశ్వేశ్వరంగారు''

''బావుందండోయి. మరిది వీరికెల్లా తెలుసు?''

''ఆ నానుడి వాళ్ళ కుటుంబంలో చెప్పుకుంటారట''

రాజుగారి చుట్ట అయిపోయింది.

కృష్ణమూర్తిగారు లేచారు. ''సరే. నే వస్తాను రాజుగారూ. ఉదయమే రాజమండ్రీ వెళ్లి వాకబు చేసొస్తాను''

''అదే మంచిది. ఈ తగాదా అయిపోతే గుడి బావు చేయించి దేవుణ్ణి ప్రతిష్టిద్దాం. ఈ పుణ్యం మీదేలెండి. కానీ ఈ లోపల మన చెయ్యి దాటి పోకుండా చూసుకోవాలి''

ఉదయం మొదటి బస్సుకి వెళ్ళిపోయారు కృష్ణమూర్తిగారు.

కుమారపురం గట్టుకింద ఊరు. గోదావరి గట్టు మీద తిన్నగా ఇరవై

కిలోమీటర్లు వెళ్ళి రావి చెట్టు దగ్గిర బస్సు దిగి రెండు కిలోమీటర్లు కిందికి సాగితే ఊరు కనిపిస్తుంది. పచ్చటి పొలాలూ, కొబ్బరి తోటల మధ్య కడుపులో చల్ల కదలకుండా ఒదిగి ఉంటుంది ఊరు. గోదావరి గట్టు మీంచి చూస్తే ఊరి మొదటి ఇంటివరకూ ఆకుపచ్చని సముద్రం. దాన్ని ఎర్రగా చీలుస్తూ ఈనెలా మట్టి రోడ్డు. రోడ్డు వంపు తిరిగి ఊళ్ళో ప్రవేశిస్తుంది. సరిగ్గా వంపు దగ్గర రోడ్డుకి దూరంగా పొలం మధ్య ఆ ఊరి శిథిల శివాలయం, ఖాళీ పానపట్టం మిగిలింది. గుళ్ళో ఎక్కువ భాగం గేదెలు కాసే కుర్రాళ్ళు పులీ మేకా ఆడుతుంటారు. గుడినిండా రాయితో గీసిన పులీ మేకా గీతలే.

గోదావరి గట్టుమీద బస్సు ఆగుతుంది. ఎటొచ్చీ ఊళ్లోంచి గట్టు వరకూ సరైన రోడ్డు పడలేదు. ఉన్న రోడ్డు వర్షాల్లో గోదావరి కాలవలా ఉంటుంది. అసలు గొడవంతా అక్కడే మొదలైంది.

మొత్తానికి ఊళ్లోంచి గట్టు వరకూ, వెడల్పు చేసుకుంటూ ముందు కంకర రోడ్డు వెయ్యడానికి నిశ్చయం అయింది. పని మొదలై పదిహేను రోజులు దాటిపోయింది. ఓరోజు సాయంకాలం రోడ్డు వంపు తిరిగిన చోటపక్కగా మట్టి తవ్వి ఎత్తుగా పోస్తున్నారు కూలీలు. ఆడ కూలీలు మట్టి తట్టలు నెత్తికెత్తుకుంటున్నారు. గట్టిగా పళ్ళ మధ్య బీడీ గిట్టగరచి గునపం దించాడు ఓ కూలీ. గునపానికి గట్టిగా రాయి తగిలింది. మిగతా ఇద్దరూ రాయి చుట్టూరా తవ్వి, గునపాలతో నిలబెట్టేరు. గునపం తగిలిన చోట పైభాగంలో మాత్రం ఓ అంగుళం పెచ్చు విరిగింది.

''ఏటిదీ?''

''కాపట్టం లేదా? సివుడి లింగం''

పది నిముషాల్లో రోడ్డు పని ఎక్కడికక్కడే స్తంభించిపోయింది. కూలీలందరూ శివలింగం దగ్గరికి చేరేరు. మేస్త్రీ ముందు తేరుకున్నాడు. గునపం పట్టిన కూలీ లెంపలేసుకున్నాడు. లింగాన్ని సభక్తికంగా ఇద్దరు ఎత్తి రోడ్డు పక్కన ఎత్తుగా ఉన్న దిబ్బమీద, వెనకాల రాయి బోటు పెట్టి నుంచోబెట్టారు. చాలాకాలంనుంచీ భూమిలో వుండిపోవడంవల్ల బాగా మట్టి పేరుకుపోయింది. కానీ అది మామూలు రాయి కాదనీ, చెక్కినదనీ తెలిసిపోతుంది.

మరో అరగంటలో ఊళ్లో తెలిసిపోయింది. విశ్వేశ్వరంగారు, రాజుగారు, ఊళ్ళో చాలామంది శివదర్శనోత్సాహంతో తరలి వచ్చేరు. విశ్వేశ్వరంగారు ప్రామాణికంగా వివరించారు.

''ఏవీ సందేహం లేదు రాజుగారు. ఇది మన శివాలయంలోని లింగమే. గుడికి అట్టే దూరం కూడా లేదు. మన అదృష్టంవల్ల శివానుగ్రహం కలిగింది''

''మరేం జేద్దావంటారు?''

''ఇహను నేను చెప్పే ముక్కే వుంది! మంచి రోజు చూసి ఇక్కణ్ణించి తరలించి సలక్షణంగా గుళ్ళో ప్రతిష్టించి వెయ్యి బిందెల గోదావరి నీటితో అభిషేకిద్దాం. తవరే పూనుకుని గుడి బాగు చేయిస్తిరా, ఈ కీర్తి అంతా తమదే. యథా ప్రకారం మళ్ళీ మడిబట్ట కట్టుకుని ఆలయంలో దీపం వెలిగించే భాగ్యం నాది. హర హర మహదేవ!''

విశ్వేశ్వరంగారితో పాటు అందరూ మరోసారి శివలింగానికి నమస్కరించారు. ఆయన కళ్ళు చెమర్చేయి.

''నే బతికుండగా గుళ్ళో దీపం పెడతాననుకోలేదు. ఇవాళనుంచే ఏకభుక్తం ఉంటాను''

ఈలోగా ఎవరో రివ్వున సైకిలుమీద ఊళ్ళోకెళ్లి ఓ కట్ట అగరొత్తులూ, ఓ కొబ్బరికాయా పట్టుకొచ్చారు. కాయ కొట్టి, అగరువత్తులు వెలిగించి చీకటి పడుతుండగా అందరూ ఊళ్ళోకి తిరుగుముఖం పట్టేరు.

రాత్రి ఏడున్నరకి భోజనం చేస్తుండగా శాస్త్రిగారికి మనవడు చెప్పేడు. ఆయన గజం బద్ద మింగినట్టయిపోయారు. వెంటనే కంగారు కూడా పడ్డారు. చెయ్యి కడుక్కుంటూనే మనవణ్ణి బలరామరాజుగారి దగ్గరికి తరిమేరాయన. వివరాలన్నీ విన్న తరువాత బెంగతో, ఆనందంతో ఆయనకి రాత్రి నిద్రపట్టలేదు.

ఉదయం ఎనిమిదవుతుండగా కర్రసాయంతో శాస్త్రిగారు రాజుగారి మెట్ల ముందు నుంచున్నారు. పూజ అయి వరండాలోకి వచ్చిన రాజుగారికి ఉదయపు టెండలో మెట్లముందు పండిపోతున్న శాస్త్రిగారు కనిపించారు.

''ఎంత మాట, మీరు కవురు జెయ్యలేకపోయారా, నేను ఒద్దును గదా. దాహంగాని పుచ్చుకుంటారా?''

కొయ్య కుర్చీలో వెనక్కి వాలి స్థిమితపడి, దాహం వద్దని చెప్పి మాట్లాడ్డం ప్రారంభించారు శాస్త్రిగారు.

''వయసులో చిన్నవారైనా మీ యెడల నాకున్న గౌరవం వేరు. మీ తండ్రి గారూ, మా తండ్రిగారూ ఎంత కలివిడిగా ఉండేవారో మనకి తెలియంది గాదు.

''ఎంత మాట! ఇద్దరూ కుర్రాళ్ళలాగ కాశీ ఎళ్ళొచ్చేరు గదా''

ఇద్దరూ నవ్వుకున్నారు.

''మీకు ఆలయం గురించీ, లింగ ప్రతిష్ఠాపన గురించీ ముఖ్యమైన భోగట్టా చెప్పాలని వచ్చేను''

అంతా విని రాజుగారు విశ్వేశ్వరంగారి గురించి కదిపేరు.

''అయితే, కొంతకాలం క్రితం ఒహాయన సన్యాసం తీసుకొని కాశీ వెళ్ళిపోతే, కారణాంతరాల వల్ల తాత్కాలికంగా కొంపెల్ల వారికి అర్చకత్వం దొరికింది. వారి అఘోరింపు అదీ. మీకు కావాలంటే ప్రమాణాల చూపిస్తాను. వారికి ఇక్కడ ఎటువంటి ప్రమేయమూ లేదు''

రాజుగారు ఇరకాటంలో పడ్డారు. గంట తరువాత శాస్త్రిగారు ధైర్యంగా ఇల్లు చేరేరు. మధ్యాహ్నం రాజుగారు టీ తాగుతుండగా విశ్వేశ్వరంగారొచ్చేరని చెప్పేరు.

వారం తిరిగొచ్చేసరికి ఊరు వాలకం మారిపోయింది. శాస్త్రిగారింటి నుంచి రాజు గారింటికీ, విశ్వేశ్వరం గారింటినుంచి రాజుగారింటికీ కాలిబాట లేర్పడ్డాయి. శివలింగం నెత్తిమీద కొబ్బరాకులతో చిన్న పందిరి ఏర్పడింది. నిత్యం ఎవరో కొబ్బరికాయలు కొట్టడం, అగరొత్తులు వెలిగించడం జరుగుతోంది.

ఊరంతా రెండు స్కంధారావాలుగా విడిపోయింది. కొంపెల్ల వారికీ, ముదిగొండ వారికీ మధ్య గాలే భగ్గుమంటోంది. ఎన్నికలు కూడా కనుచూపు

మేరలో ఉండటంతో ఇద్దర్నీ రెండు పక్షాలు సమర్థించాయి. క్రమంగా సమస్య ఎన్నికలయ్యే వరకూ పరిష్కారం అవదేమోనని కొందరు అనుమానించారు. మొత్తానికి, కాకులు మామూలుగా అన్ని ఇళ్ళమీదా నిష్పక్షపాతంగా వాలుతున్నా ఊరు పెనంలా మాడుతోంది. రాజుగారికి దానిమీద కోపీనంతో కూచున్న ట్టుంది. తన పక్షం అవకపోతే శ్రీశైలం వెళ్ళి ప్రాయోపవేశం చేస్తానని శపథం చేశారు శాస్త్రిగారు. ఈలోగా శివలింగం వెనక శాసనం కూడా ఉందని తెలిసిపోయింది, అందరికీ.

ఏవీ దిక్కుతోచని స్థితిలో రాజుగారికి చటుక్కున కృష్ణమూర్తి మేస్టారు జ్ఞాపకం వచ్చేరు. మేస్టారు కుమారపురానికి ఇంచుమించుగా ధౌమ్యులవారు. ఉపాయం ఆయన చెప్పాల్సిందే.

''నేను మాత్రం ఏం చెయ్యగలను చెప్పండి? దేవుడి విషయంలో కూడా పార్టీలొచ్చేయి''

''అదిగాదు. ఇద్దరూ ఇలాగే అల్లరి చేస్తే మీ అగ్రహారం ఓట్లు చీలిపోతాయి. మరదాలోచించారా?''

''సరే. అది మీ సమస్య''

''అలాక్కాదు మీరోసారి ఇద్దర్నీ కలుసుకుని మాటాడిరండి''

''అలాగే. ఏదోరకంగా సయోధ్య కుదిరితే అంతకంటేనా?''

కృష్ణమూర్తిగారు సాయంకాలం బస్సులో తిరిగొచ్చేరు. స్నానం చేసి రాజుగారి దగ్గరికెళ్ళేరు. ఇద్దరూ టీ తాగుతుండగా మేస్టారు ఆరంభించారు.

''అయ్యా! పని అయిందని చెప్పలేను. అక్కడ లైబ్రరీలో శాసనాల పుస్తకాలున్నాయి. ద్రాక్షారామ శాసనాలన్నీ ఓ పుస్తకంలో, చాళుక్యుల శాసనాలు మరో చోటా వున్నాయి. మన ఊరి శాసనం మాత్రం లేదు''

''ఏంచేతంటారు!''

''అది హైదరాబాదులో గాని దొరకదు''

''హూ!''

''ఫరవాలేదు. హైదరాబాదు పురావస్తు శాఖలో ఒకరికి ఉత్తరం రాయించాను. వెంటనే జవాబొస్తుంది. ఆ, మరో మాట. రాజమండ్రిలో రెడ్డిగారనీ ఆ శాఖకి సంబంధించిన మనిషి. ఆయన్ని గూడా కలిశాను.''

''ఏమంటాడు?''

''ఆయన మాత్రం, ఆలయం మాత్రం పాతదే. మిగతా వివరాలు తెలీవన్నాడు. సరే ఏవో రాతలున్నాయి గదా, వారిని ఆదివారం ఓసారి రమ్మన్నాను. ఆదివారం పదవ్వకుండా వస్తానన్నారు''

''మంచి పని చేశారు. వారికి భోజనం మనింటోనే. గట్టు మీదికి వీరిగాణ్ణి సైకిలిచ్చి పంపుతాను''

శనివారం ఉదయానికల్లా దైవికంగా రాజమండ్రీ నుంచి ఉత్తరం వచ్చింది. క్రీ.శ. 1625 కుమారపుర శాసనం పాఠం అక్షరాలా శాస్త్రిగారు చెప్పినట్టే వుంది. రాజుగారు ఇక మానసికంగా శాస్త్రిగారి పక్షం వహించారు. ఓట్లు ఎన్ని చీలే అవకాశం ఉందో ఆయన లెక్క వేసేసుకున్నారు. పైగా శాస్త్రిగారు ''ఒయసులో పెద్దవారుగదా''. ఊరు మరోసారి ఉడికిపోయింది.

ఆదివారం వీరిగాడు రెడ్డిగార్ని సైకిలెక్కించుకుని రోడ్డు పక్కన తాత్కాలిక శివాలయం దగ్గిర దింపేడు. అప్పటికే జనం పోగయ్యారు. రాజుగార్నీ, మేష్టార్నీ చూసి జనం దూర దూరంగానే ఉన్నారు. సైకిలు దిగ్గానే, మేష్టారు రెడ్డిగార్ని అందరికీ పరిచయం చేశారు.

శివలింగాన్ని పరీక్షగా ఓసారి చూసి రెడ్డిగారు బిందెడు నీళ్ళు తెప్పించారు. అభిషేకం తరువాత శివలింగం శుభ్రం అయింది. మోకాళ్లమీద వంగి లింగాన్ని వెనక్కి తిప్పి వాల్చి, బ్రష్‌తో శుభ్రం చేసి తెల్లటి పొడి చల్లేరు రెడ్డిగారు. పది గజాల అవతల జనం బలవంతంగా ఊపిరి పీల్చుకుంటున్నారు. గుసగుసలు తప్ప మాటలు లేవు. తెల్లటి పొడి వేపు చూస్తూ కాసేపు రెడ్డిగారు అలాగే ఉండిపోయి, లేచి నుంచుని ఇవతలికి వచ్చేరు.

''చూశారా?''

''ఆ. రండి. అదేనా ఆలయం?''

ఉత్కంఠతో రాజుగారికి ఊపిరితిత్తులు బద్దలౌతున్నాయి. కృష్ణమూర్తిగారి కూడా వాతావరణ ప్రభావం సోకింది. అయినా ఇద్దరూ ఏవీ మాటాడలేదు. ముగ్గురూ ముందు నడుస్తుండగా వెనక జనం. శివాలయం చూసి వస్తూండగా ఆపుకోలేక అడిగేశారు రాజుగారు.

''ఆ లింగం ఈ గుడిదేనంటారా?''

రెడ్డిగారు సమాధానం చెప్పలేదు. ముగ్గురూ రాజుగారింటికి వెళ్ళేరు. చెప్పులు విడిచి కాళ్ళు కడుక్కుని వరండాలో కుర్చీలో కూచున్నారు. కొంతమంది జనం ఓపిగ్గా బయటే నుంచున్నారు. రెండో పార్టీ మనిషి అప్పుడే విశ్వేశ్వరంగారింటికి సగౌరవంగా వర్తమానం వెళ్ళేడు.

రెడ్డిగారు నిశ్శబ్దంగా గోడమీది రాజుగారి యవ్వనంలో ఫోటో చూస్తున్నారు. ఇంక ఉండబట్టలేక కృష్ణమూర్తిగారు అడిగేశారు.

''లింగం వెనుక ఏవేనా రాసి ఉందంటారా?''

''ఉంది''

''ఆహా! ఏవని రాశారో?''

రెడ్డిగారు మేస్టారి వేపు ఓసారి చూసి, వచ్చే నవ్వు కష్టంమీద ఆపుకుంటూ అన్నారు.

''తారు పూర్తిగా పోలేదు, కనిపిస్తోంది. ఒకటీ బై నాలుగు''

*14-2-90*

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

*